


వెండి నాగ పడగ సమర్పణ


మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గుంటూరుకు చెందిన గోరంట్ల వేణునాథ్ రూ.1,10,000 విలువైన వెండి నాగ పడగను బుధవారం సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2,423 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1,179 క్యూసెక్కులు వదిలారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి



అమరావతి: అమరావతిలోని కన్యకా పరమేశ్వరి దేవిని ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరీ దేవిగా బుధవారం అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మకు సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

డీఎస్పీల బదిలీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర వ్యాప్తంగా 96 మంది డీఎస్పీలను బుధవారం బదిలీ చేశారు. ఈ మేరకు గుంటూరు రేంజ్‌లో పలువురు డీఎస్పీలు బదిలీయ్యారు. గుంటూరు డీసీఆర్‌బీ డీఎస్పీ పి.శ్రీనివాసరావును కాశిబుగ్గకు, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ వీవీనాయుడును విజయవాడ ఏసీపీ ట్రాఫిక్ డివిజన్–1కు, విజయవాడ ఏసీపీ ట్రాఫిక్ డివిజన్–1 డీఎస్పీ బి.జనార్దన్‌రావును గుంటూరు జిల్లా తెనాలి సబ్ డివిజన్‌కు, గుంటూరు ఎస్పీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పి.మల్లికార్జునరావును విజయవాడ దిశకు, గుంటూరు నార్త్ డీఎస్పీ సి.హెచ్.రవికాంత్, గుంటూరు సౌత్ డీఎస్పీ ఎండీ.మెహబూబ్‌బాషా, గురజాల డీఎస్పీ సి.హెచ్.శ్రీనివాసరావులను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. వెయింటింగ్‌లో ఉన్న డీఎస్పీ బి.ప్రసాద్‌ను పల్నాడు దిశ (ఉమెన్)కు బదిలీ చేశారు.

నగర కమిషనర్(ఎఫ్ఏసీ)గా హరికృష్ణ బాధ్యతల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతల(ఎఫ్ఏసీ)పై ఎస్.హరికృష్ణ బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులతో పెన్షన్ పంపిణీ, ఇతర అంశాలపై సమీక్షించారు. సూచనలు చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మెరుగైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అవుట్ ఫాల్ డ్రెయిన్లలో వర్షపు నీరు నిల్వ లేకుండా పర్యవేక్షించాలని, తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం విభాగాధిపతులు, అధికారులు కమిషనర్‌కు పూల బొకేలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్లు సి.హెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని సీతానగరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ రవి సుభాష్‌బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణంలో విద్యుత్ అంతరాయాల నివారణకు అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ పి.విజయకుమార్, ఈఈ రాంబొట్లు, డెప్యూటీ ఈఈ అక్కల సత్యనారాయణ, ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫెయిర్ డీల్ క్యాపిటల్, హెచ్–1 హెచ్‌ఆర్ సొల్యూషన్స్, కేప్‌స్టన్ సర్వీసెస్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కోసం టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువత జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 98668 22697, 87907 90762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఆగస్టు నెల పెన్షన్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. సాధ్యమైనంత వరకు 1నే 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎవరైనా 1న తీసుకోలేకపోతే 2న విధిగా పంపిణీ చేయాల్సి ఉంది. గుంటూరు జిల్లాలో 2,60,192 మంది లబ్ధిదారులకు రూ.110.69 కోట్లు విడుదలయ్యాయి. బుధవారమే ఈ నగదును బ్యాంకుల నుంచి డ్రా చేసుకున్నారు. ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీని మొదలు పెట్టాలని సిబ్బందికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఒక్కో ఉద్యోగికి 50 నుంచి 100 పెన్షన్లు

గుంటూరు జిల్లాలో 4,840 మంది సచివాలయ, ఇతర శాఖల సిబ్బంది చేత పింఛన్ల పంపిణీకి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఒక్కో ఉద్యోగికి 50 నుంచి వంద మంది లబ్ధిదారులను మ్యాపింగ్ చేసినట్టు సమాచారం.

నిజాయతీపై కన్నెఱ్ఱ!

- పోలీస్ అధికారులపై నిందలు
- రౌడీ షీటర్ చింతమనేనిని అడ్డుకున్నాడని డీఎస్పీపై చర్యలు
- ఉద్యోగ విరమణకు ఒకరోజు ముందు వీఆర్‌కి అశోక్ కుమార్ గౌడ్
- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ముగ్గురు అధికారులపై వేటు
- మండిపడుతున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం పోలీసుల పట్ల వ్యవహరిస్తున్న తీరు ఆ విభాగంలో చర్చనీయాంశంగా మారింది. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ పోలీసులను వేధించడం, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్‌ను ఉద్యోగ విరమణకు ఒక్కరోజు ముందు వీఆర్‌కి పిలిచారు.

చింతమనేనితో వివాదమే కారణమా!

గతంలో ఆయన నూజివీడు డీఎస్పీగా పనిచేసిన సమయంలో పెదపాడు మండలంలో గ్రామ పంచాయతీలకు జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా రౌడీషీట్ ఉన్న దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో వివాదం జరిగింది. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో బయట వ్యక్తులను గ్రామంలోకి అనుమతించలేదు. అప్పటి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వచ్చినా ఆయననూ గ్రామం నుంచి పంపించి వేశారు. తర్వాత వచ్చిన

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు



చింతమనేనినీ వెళ్లిపోవాలని పోలీసులు చెప్పినా అతను వినకుండా వాగ్వాదానికి దిగడంతో డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ స్పందించి చింతమనేనిని అక్కడి నుంచి వెనక్కి పంపారు. అప్పట్లో ఆ వీడియో వైరల్ అయ్యింది. ఆ రోజు నిబంధనల మేరకే డీఎస్పీ వ్యవహరించారు. ఎక్కడా తన పరిధి దాటలేదు. సాధారణ ఎన్నికల సమయంలో ఆయనను తుళ్లూరు డీఎస్పీగా మార్చారు. ఆయన ఇక్కడ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఏ పార్టీకీ కొమ్ము కాయకుండా నిజాయతీగా పని చేశారు. అయినా గతంలో చింతమనేని విషయంలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగింది. గౌరవ ప్రదంగా రిటైర్ అయ్యే అవకాశం ఇవ్వకుండా ఉద్యోగ విరమణకు ఒక్క రోజు ముందు వీఆర్‌కి పిలిచింది. సాధారణంగా ఎవరికైనా ఏదో ఒక పోస్టులో రిటైర్ అయ్యే అవకాశం కల్పిస్తారు. దీనికి భిన్నంగా వ్యవహరించడం ద్వారా కక్ష సాధింపులకు దిగినట్టైంది. ఈ పరిణామం పట్ల పోలీసు వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఏదైనా తప్పు చేస్తే శిక్షించవచ్చుకానీ గతంలో తమకు అనుకూలంగా వ్యవహరించలేదన్న కారణంతో ఈ విధంగా వ్యవహరించడం సరికాదని రిటైర్డ్ పోలీసు ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నేతల కార్యాలయాలపై దాడుల కేసుల్లో చర్యలేవీ?

ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే తెలుగుదేశం వర్గాలు గుంటూరు నగరంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పార్టీ కార్యాలయం, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయంపై రాళ్ల దాడి చేశారు. ఈ దాడుల్లో కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలపై ప్రభుత్వం పెద్దగా స్పందించలేదు. నామమాత్రంగా కేసు నమోదు చేసి కొంతమందికి 41ఏ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఘటనల వెనుక ఎవరున్నారు అన్న విషయం గురించి ఆరా కూడా తీయలేదు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని సీరియస్‌గా తీసుకున్నప్పుడు గుంటూరులో జరిగిన వైఎస్సార్ సీపీ కార్యాలయాలపై దాడుల కేసులో ఉదాసీనంగా ఎందుకు వ్యవహరిస్తున్నారో ప్రభుత్వంతోపాటు పోలీసు శాఖ ఉన్నతాధికారులే చెప్పాలి.



పార్టీ కార్యాలయం దాడి కేసులో పారదర్శకంగా వ్యవహరించినా..!

గుంటూరు జిల్లాలో కూడా తెలుగుదేశంపార్టీ కార్యాలయంపై దాడి ఘటనను అడ్డం పెట్టుకుని ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్ఐలపై వేటు వేయడం, మరో ఇద్దరిపై విచారణ జరపడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ కార్యాలయంపై దాడి జరిగినప్పుడు పోలీసులు పారదర్శకంగా వ్యవహరించారు. కేసు నమోదు చేసి, నిందితులను గుర్తించి 41ఏ నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత కావాలని హత్యాయత్నం, దోపిడీ సెక్షన్లు చేర్చి వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా చేసుకుని ఇబ్బంది పెట్టే కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా గతంలో ఈ కేసును విచారణ చేసిన పోలీసులపై వేటు వేయడం సరికాదని పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయినా పోలీసు ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దలకు వంతపాడుతున్నారు.

పుస్తకం.. ఆలస్యం.. శాపం



గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అందిన అరకొర పుస్తకాలు, బ్యాగులు (ఫైల్)

- బ్యాగులు, నోట్ పుస్తకాలకూ కరువు
- జిల్లాలోని ఐదు కళాశాలల్లో 1,967 మంది విద్యార్థులు
- 2,273 పాఠ్య పుస్తకాల కొరత
- 341 మందికి అందని బ్యాగులు
- ప్లస్ టూ స్కూళ్లకూ చేరని పాఠ్య పుస్తకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో తప్పటడుగులు వేస్తోంది. ఆగస్టు వచ్చినా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలను అందించలేని దుస్థితి నెలకొంది. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠశాలల్లో విద్యార్థులతో సమానంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు ఇస్తామని చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ క్షేత్రస్థాయిలో మెటీరియల్ పంపిణీలో నెలకొన్న జాప్యం, కళాశాలలకు పూర్తిస్థాయిలో సామగ్రి చేరని విషయమై దృష్టి సారించడం లేదు. గుంటూరు నగరంలోని ప్రభుత్వ బాలికల, వృత్తి విద్యా జూనియర్ కళాశాలలతోపాటు సిరిపురం, పెనుమాక, చేబ్రోలులో కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సర విద్యార్థులు 1,071 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 862 మంది చొప్పున మొత్తం 1,967 మంది ఉన్నారు. వీరికి అవసరమైన 1,967 బ్యాగుల్లో ఇప్పటి వరకు కళాశాలలకు సరఫరా చేయగా, మరో 341 మందికి బ్యాగులు అందాల్సి ఉంది. పాఠ్య పుస్తకాలు 8,915 రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 6,648 పుస్తకాలే



ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలు

వచ్చాయి. మరో 2,273 పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉన్నాయి. 23,640 నోటు పుస్తకాలకు 20,124 పుస్తకాలు అందాయి. మరో 3,516 రావాల్సి ఉన్నాయి. హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకూ పాఠ్య పుస్తకాల పంపిణీ జరగలేదు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నా, విద్యార్థులకు తరగతులు సక్రమంగా జరగని దుస్థితి నెలకొంది.

ఇండెంట్ పంపాం



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులను వచ్చినవి వచ్చినట్లుగా కళాశాలలకు పంపిణీ చేశాం. మిగతా సామగ్రి కోసం మళ్లీ ఇండెంట్ పంపాం.

– జె.పద్మ, జిల్లా వృత్తి విద్యాధికారి, గుంటూరు

400 మందికి 30 మంది టీచర్లా!

- కలెక్టర్ నాగలక్ష్మి ఆశ్చర్యం
- 50 మంది విద్యార్థుల గైర్హాజరుపై ఆగ్రహం
- కుంటిసాకులు చెప్పొద్దంటూ హెచ్చరిక

ప్రత్తిపాడు: '400 మంది విద్యార్థులకు 30 మంది ఉపాధ్యాయులా? వెయ్యి మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లోనూ 30 మంది టీచర్లే ఉంటున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఏం ప్రయత్నాలు చేశారు? ఒక్కరోజే 50 మంది విద్యార్థులు పాఠశాలకు ఎందుకు గైర్హాజరయ్యారు? మీరేం చర్యలు తీసుకున్నారు?' అంటూ కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంను ప్రశ్నించారు. ప్రత్తిపాడులో బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి పర్యటించారు. ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె స్కూల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని హెచ్ఎం శ్రీనివాసరావును ప్రశ్నించారు. 401 మంది ఉన్నారని, అందులో 50 మంది ఈ రోజు హాజరు కాలేదని చెప్పారు. 50 మంది ఒకే రోజు బడికి రాకపోవడానికి కారణాలు ఏమిటని అడగడంతో, వర్షాల వల్ల రాలేదంటూ హెచ్ఎం సమాధానమిచ్చారు. దీంతో అసహనానికి గురైన కలెక్టర్ ఏదో వర్షాలు ఎడతెరిపిలేకుండా పడుతున్నట్లు చెబుతున్నారు? కొద్దిపాటి వర్షాలకే విద్యార్థులు పాఠశాలకు రాలేదా? వారి గైర్హాజరుకు గల కారణాలను వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి కనుక్కున్నారా అని ప్రశ్నించడంతో హెచ్ఎం బదులివ్వలేకపోయారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి ఆరా



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాస్‌పై ప్రశ్నల వర్షం కురిపిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

తీశారు. పాఠశాల ఆవరణలో అరెకరం విస్తీర్ణంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

సీహెచ్‌సీతోపాటు, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

తొలుత ప్రత్తిపాడు కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇన్‌పేషెంటు విభాగంలో చికిత్స పొందుతున్న రోగులను అడిగి సేవలపై ఆరాతీశారు. గర్భిణులను గుర్తించి వారికి ప్రతి నెలా పరీక్షలు నిర్వహించాలన్నారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ మరమ్మతులకు గురవ్వడంతో, గొట్టిపాడు పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌ను ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించే అంశాన్ని పరిశీలించాలన్నారు. అనంతరం భవన ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు చేశారు. చిన్నారులతో మాట్లాడారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, డీసీహెచ్ఎస్ సుబ్రహ్మణ్యరాజు, ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ నాగార్జున, తహసీల్దార్ కె.రవిబాబు, ఎంపీడీఓ కె.దర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎయిమ్స్‌కు మౌలిక వసతులు

మంగళగిరి: ఎయిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎయిమ్స్‌ను సందర్శించిన కలెక్టర్ ఎయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ మధుబానందకర్, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్‌లతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎయిమ్స్‌లో 4ఎల్ఎల్‌డీ వాటర్ పనులు, విస్తరణ స్థలాల కేటాయింపు, మంగళగిరి నుంచి రోడ్డు నిర్మాణం, అటవీశాఖ అనుమతులు, స్టామ్ వాటర్ డ్రెయిన్లలో నిర్మాణం, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా, ఎయిమ్స్‌కు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల బదలాయింపు తదితర అంశాలపై ఎయిమ్స్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంజేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఆర్డీఓ పెద్ది రోజా, ఎయిమ్స్ అడ్మిస్ట్రేషన్ డీడీ శశికాంత్, ఎస్ఈ ఎల్‌టీ కల్నల్ రవిశంకర్ సిన్హా, మెడికల్ సూపరింటెండెంట్ ఆర్.నటరాజ్, డీఎంహెచ్ఓ డాక్టర్ విజలయక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ డేంజర్ బెల్

- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- 2021 నుంచి తీసుకుంటే గుంటూరు నగరంలోనే అధికం
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణాపాయం
- ముందుజాగ్రత్తలతో వ్యాధి నుంచి రక్షణ

గుంటూరు మెడికల్: జిల్లాలో డెంగీ డేంజర్ బెల్ మోగుతోంది. ఇటీవల కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ముందు జాగ్రత్త చర్యలతో వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చని, ఒక వేళ డెంగీ సోకిన వైద్యుని వద్దకెళ్లి సరైన చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని డాక్టర్లు చెబుతున్నారు.



లక్షణాలు

డెంగీ సోకితే వాంతులు, తల నొప్పి, కంటి గుడ్డు కదిలినప్పుడు నొప్పి, కండరాలు, కీళ్ళ నొప్పులు, వాంతి అయినట్లు భ్రాంతి కలగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒంటిపై ఎర్రటి గుల్లలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ఒక్కోసారి రక్తస్రావం జరుగుతుంది. రక్తపరీక్ష చేసి ఎలీసా పద్ధతిలో డెంగీ జ్వరాన్ని నిర్ధారిస్తారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

డెంగీ సోకకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. పగటి వేళ కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ సోకుతుంది. మంచినీటిని నిల్వచేసే ప్రదేశంలో ఇవి పెరుగుతాయి. వాడి పారేసిన వస్తువులు, నిలువ ఉండే నీటి కుంటలు, నీటి డ్రమ్ములు, తొట్టెలు, గాబులు, రుబ్బు రోళ్ళు, వాడి పారేసిన టైర్లు, టీ కప్పులు, ప్లాస్టిక్ కప్పులు, వాడి పారేసిన కొబ్బరి చిప్పలు, బోండాలు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్స్ వెనుక భాగాల్లో, పూల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి సంపుల్లో ఈ దోమ లార్వాలు పెరుగుతాయి. ఇంటి పరిసరాల్లో ఇలాంటివి లేకుండా చూసుకుంటే డెంగీ బారిన పడకుండా ఉండొచ్చు.

పట్టణాల్లోనే కేసులు అధికం

గ్రామీణ ప్రాంతాల్లో కంటే మున్సిపాలిటీలు, గుంటూరు కార్పొరేషన్ పరిధిలోనే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. గత నాలుగేళ్ల కేసులు పరిశీలిస్తే గుంటూరు నగరంలో 234, తెనాలి డివిజన్‌లో 37, మంగళగిరి, తాడేపల్లిలలో ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది తెనాలి డివిజన్‌లో 28, గుంటూరు నగరంలో 82 కేసులు నమోదయ్యాయి. చేబ్రోలులో 10 కేసులు, సుదురుపాడులో తొమ్మిది, మేడికొండూరు ఆరు కేసులు, సంగంజాగర్లమూడిలో ఐదు కేసులు, నమన్నవ, కొలకలూరు, పొన్నెకల్లులో నాలుగు చొప్పున డెంగీ కేసులు నమోదయ్యాయి.

డెంగీ కేసులు ఇలా..

సంవత్సరం	నమోదైన కేసులు
2021	447
2022	168
2023	375
2024 జూలై 25 వరకు	152

సొంత వైద్యం ప్రమాదకరం



ఏ జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గడం సహజం. కానీ సొంత వైద్యం ప్రమాదకరం. జ్వరం సోకిన వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఆయన సూచనల మేరకు మందులు వాడాలి. బొప్పాయి తింటే ప్లేట్‌లెట్లు పెరుగుతాయని, మెడికల్ షాపుల్లో మందులు తెచ్చుకుని వేసుకోకూడదు. అపోహలు వీడాలి. డెంగీ నాలుగో దశలో మాత్రమే ప్రాణాపాయం ఉంటుంది. మొదటి మూడు దశల్లో సరైన చికిత్స తీసుకుంటే ప్రమాదం ఉండదు.

– డాక్టర్ రేవూరి హరికృష్ణ, సీనియర్ జనరల్ ఫిజీషియన్, గుంటూరు

ఉచితంగా వైద్య పరీక్షలు



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో కేసులు నమోదైన వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదేశించాం. ప్లేట్‌లెట్ల విషయంలో అపోహలు వద్దు. జిల్లాలో దోమల నివారణ చర్యలు చేపట్టాం. 5.40 లక్షల గంబూషియా చేప పిల్లలను నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో వదిలాం. కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల నివారణ మందులు ఫాగింగ్ చేస్తున్నాం. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. నిద్రించే సమయంలో దోమ తెరలు వాడటం మంచిది.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

అప్పుల బాధతో కౌలు రైతు మృతి



కౌలు రైతు నాగరాజు

ప్రత్తిపాడు: అప్పుల బాధతో కౌలు రైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో జరిగింది. చినకోండ్రుపాడుకు చెందిన పుట్టా నాగరాజు(40) గత ఏడాది ఆరు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అందులో మూడు ఎకరాల్లో మిర్చి, రెండు ఎకరాల్లో పత్తి, ఒక ఎకరంలో కూరగాయలు సాగు చేశాడు. సుమారు రూ.13 లక్షలు అప్పు చేశాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 30న సాయంత్రం కుమారుడికి ఫోన్ చేసి నేను ఊరెళుతున్నాని, అమ్మను, చెల్లిని బాగా చూసుకోవాలని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసేశాడు. బుధవారం చినకోండ్రుపాడు సమీపంలోని శ్రీనాథ్ ప్లాట్స్‌లో నాగరాజు మృతి చెంది ఉన్నాడు. పురుగుల మందును థమ్సప్‌లో కలుపుకుని తాగి నాగరాజు మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.

అధికారులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి

- ఎమ్మెల్యే రామాంజనేయులు అనుచిత వ్యాఖ్యలు
- టీడీపీ నాయకుల సమన్వయంతో పని చేయాలని ఆదేశం
- బిత్తరపోయిన అధికారులు

కాకుమాను: ప్రతి అధికారి ఒళ్లు దగ్గరపెట్టుకుని పని చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అనుచిత వ్యాఖ్యలు చేశారు. స్థానిక గంగా, పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

మండల స్థాయి అధికారి గ్రామాల్లోని టీడీపీ నాయకుల సమన్వయంతో కలిసి పని చేయాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఒక్క అధికారి ఒళ్లు దగ్గరపెట్టుకుని పని చేయాలని గత ప్రభుత్వంలో మాదిరిగా పని చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఏ పథకమైనా మండలంలోని నాయకుల సంతకం ఉంటేనే లబ్ధిదారులకు ఇవ్వాలని ఆదేశించారు. నాయకుల ప్రమేయం లేకుండా ఎలాంటి పనులు చేపట్టినా ఇబ్బందులు పడక తప్పదని హెచ్చరించారు. గత ప్రభుత్వం మాదిరిగా పని చేస్తే కుదరదని మండల స్థాయి నాయకుల సూచనల మేరకు మాత్రమే ప్రతి అధికారి పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారుల తీరుపై ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఆయా శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి తీరు మార్చుకోవాలని లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

క్లుప్తంగా

తెనాలి డీఎస్పీగా జనార్ధనరావు



తెనాలిరూరల్: తెనాలి డీఎస్పీగా బి.జనార్ధనరావు తిరిగి నియమితులయ్యారు. గతేడాది మే 10వ తేదీన ఇక్కడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయవాడ ట్రాఫిక్ డివిజన్-1 ఏసీపీగా ఫిబ్రవరిలో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మైలవరం ఏసీపీగా పని చేస్తూ ఎం.రమేష్ ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఆయనను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు. కాగా 1995 బ్యాచ్‌కు చెందిన జనార్ధనరావు ఉమ్మడి కృష్ణా జిల్లాలో వివిధ స్టేషన్‌లలో ఎస్ఐగా పని చేసి సీఐగా పదోన్నతి పొంది సీఐడీ విభాగంలో పని చేశారు. 2019లో డీఎస్పీగా పదోన్నతి పొంది అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)లో పని చేశారు.

కొనసాగుతున్న బాలికల బాస్కెట్ బాల్ పోటీలు



గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులోని లయోలా పాఠశాలలో ఆంధ్రా, తెలంగాణ ఐసీఎస్ఈ, ఐఎస్ఈ రీజినల్ స్థాయి బాలికల బాస్కెట్ బాల్ పోటీలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. అండర్-14, అండర్- 17, అండర్- 19 విభాగాల్లో మొత్తం 45 జట్లు తలపడ్డాయి. పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని క్రీడల్లో నైపుణ్యతలు మెరుగుదిద్దుకునే దిశగా క్రీడాకారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సుపీరియర్ ఫాదర్ ఆంథోని పర్యవేక్షించారు.

ఫిరంగిపురంలో 42.8 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 42.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా కాకుమాను మండలంలో 1.2 మి.మీ. వర్షం పడింది. సగటున 19.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. తాడికొండ 35.2, దుగ్గిరాల 30.8, గుంటూరు తూర్పు 28.2, మంగళగిరి 28.2, ప్రత్తిపాడు 25.4, వట్టిచెరుకూరు 23.4, మేడికొండూరు 22.2, పెదకాకాని 21.4, తుళ్లూరు 20.8, గుంటూరు పశ్చిమ 18.8, తాడేపల్లి 18.6, కొల్లిపర 12.8, చేబ్రోలు 7, తెనాలి 5.8, పొన్నూరు 3.2, పెదకాకాని మండలంలో 2.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూలై మాసంలో జిల్లా సాధారణ వర్షపాతం 164.9 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 216.9 మి.మీ వర్షపాతం పడింది.

'యువకుడు కొత్తగా బైక్ కొనుగోలు చేశాడు. ఫ్యాషన్‌గా భావించిన అతడు గుంటూరు నుంచి విజయవాడ బయలుదేరాడు. హెల్మెట్ . దరించడం ఇబ్బందిగా ఫీల్ అయ్యాడు. ముందు వెళ్తున్న లారీని తప్పించే క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. పోలీసులు ఆస్పత్రికి తరలించే లోగా మృత్యువాత పడ్డాడు.' ఇలా అనేక మంది హెల్మెట్ లేకుండా ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్న వారి సంఖ్య పెరిగిపోయింది.



గుంటూరు నగరంలో హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న యువకులు

తలకెక్కించుకోండి..

- వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి
- ప్రమాదాల్లో హెల్మెట్ లేకనే మరణాలు
- ఇక వాడకం తప్పని సరి చేసిన ప్రభుత్వం

పట్నంబజారు: వాహనచోదకులు బైక్ నడిపే క్రమంలో హెల్మెట్ ఎంతో అవసరం.. అదే మన ప్రాణాలకు రక్షణ కవచం. నిర్లక్ష్యం చేయకుండా' తల కెక్కించుకోండని పోలీసులు, అధికారులు వివిధ సందర్భాల్లో చెబుతున్నా.. మనం పెడచెవిన పెడుతున్నాం. అనేక హెచ్చరికలు చేస్తున్నప్పటికీ తలకెక్కించుకునే పరిస్థితులు కనపడటం లేదు. అదే నిర్లక్ష్యంతో ఆనందంగా సాగాల్సిన జీవన ప్రయాణంలో అంతులేని విషాదం నింపుకొంటున్న వారెందరో. ఫలితంగా రహదారులు రుధిరంగా మారుతూ... అయిన వారిని కోల్పోయిన కుటుంబాలు జీవితాంతం దుఃఖ సాగరంలో మునిగిపోతున్నాయి.

యువత, విద్యార్థులే అధికం...

జిల్లాలో చోటుచేసుకుంటున్న ప్రమాదాల సంఖ్యను పరిశీలిస్తే.. అధికశాతం యువత, విద్యార్థులే. తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమతో అడిగిన వెంటనే అధిక సీసీ వాహనాలను కొనిస్తున్నారు. వాటిపై హెల్మెట్ లేకుండా వేగంగా వెళ్తూ, ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడేళ్లలో చోటుచేసుకున్న ప్రమాదాల్లో 932 మంది మరణించగా, ఇందులో చాలా వరకూ హెల్మెట్ లేకపోవడంతోనే మృత్యువాత పడ్డారని పోలీసులు చెబుతున్నారు.

నిబంధనలు తీసుకొచ్చినా..

2019లోనే హెల్మెట్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిబంధన తీసుకువచ్చినా అది అమలు కావడంలేదు. ఎన్నిసార్లు చెప్పినా హెల్మెట్ ధారణపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడంలేదనే చెప్పాలి. గుంటూరు, తెనాలి, మంగళగిరి వంటి నగరాల్లో 20 శాతం హెల్మెట్ ధరిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం మాత్రం హెల్మెట్ పెట్టుకుంటున్నారనే అధికారులు చెబుతున్నారు. వివిధ సందర్భాల్లో అధికారులు కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేశారు.

కేసులు ఇలా....

ఏడాది	కేసులు	అపరాధ రుసుం
2022	187	రూ.లక్ష 87వేలు
2023	137	రూ.లక్ష 37 వేలు
2024	178	రూ.లక్ష 78 వేలు

మూడేళ్లలో జిల్లాలో ప్రమాదాలు

ఏడాది	మృతులు	క్షతగాత్రులు	
2022	1084	422	2023
2023	965	328	1904
2024	205	182	1200పైగానే

బైక్ ప్రమాదాలకు కారణాలు

- రోడ్డు మలుపుల వద్ద వేగంగా వెళ్లడం, జాగ్రత్తలు పాటించకపోవడం
- కూడళ్లలో రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా దూకుడుగా వెళ్లడం
- ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళుతూ అదుపు తప్పడం
- మద్యం మత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం
- సరైన నైపుణ్యం లేని డ్రైవింగ్, రహదారి భద్రతపై అవగాహన లేకపోవడం

హెల్మెట్ తప్పనిసరి

ఇటీవల కేంద్రం రహదారి భద్రతా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించాలంటే హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని తీర్మానించింది. ద్విచక్ర వాహన ప్రమాదాల్లోనే మరణాల శాతం అధికంగా ఉండటాని ఈ కారణంగా అభిప్రాయపడింది. ఈ ఘటనల్లో తల రోడ్డుకు తగిలి బలమైన గాయాలైన సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని నిపుణులు చెబుతున్నారు.

ప్రాణం విలువైందని తెలుసుకోండి



హెల్మెట్ లేకపోవడం వలన ద్విచక్ర వాహన ప్రమాదాల్లో చాలామంది మృతి చెందుతున్నారు. హెల్మెట్ తలకు తగిలించి గడ్డం కింద సేఫ్టీ బెల్ట్ పెట్టుకోవడం లేదు. దీనివల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ పడిపోయి ప్రాణాలకు ముప్పు వస్తుంది. వారిని రక్షించేందుకు గోల్డెన్ అవర్లో ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదు. ప్రాణం అన్నింటికన్నా విలువైంది. పోలీసులు. రవాణా శాఖాధికారులు కేసులు రాస్తారు. జరిమానాలు విధిస్తారనే కోణంలో కాకుండా మన ప్రాణ రక్షణకు హెల్మెట్ అని గుర్తించండి.

–షేక్ కరీం, డీటీసీ, గుంటూరు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- హైవేపై ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని..
- తక్కెళ్లపాడు వద్ద ఘటన

పెదకాకాని: జాతీయ రహదారిపై ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి మరో వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. పొన్నూరు ప్రాంతానికి చెందిన మన్నెం కోటయ్య, చౌడూరి శ్రీనివాసరావు, సోమయ్య అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనంలో తేనె బుట్టలు లోడుతో మంగళవారం కృష్ణాజిల్లా కంచికచర్ల వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి పొన్నూరు బయలు దేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం జాతీయ రహదారిపై తక్కెళ్లపాడు శివారు ప్రాంతంలోకి చేరుకున్నారు. అదే సమయంలో ఆ ప్రాంతంలో టైర్ పంక్చర్ కావడంతో రోడ్డుపైనే ఆగిన మరొక అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆ వాహనంలో ఉన్న చౌడూరి శ్రీనివాసరావు(28) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మన్నెం కోటయ్య, సోమయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికై ఈనెల 20లోగా అడ్మిషన్ ఫీజు చెల్లించి, 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్‌లో చేరేందుకు 14 ఏళ్లు, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు టెన్త్ పూర్తి చేసి, 15 ఏళ్లు నిండిన అభ్యాసకులు ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైకుంఠపుర వాసునికి రూ. 23 లక్షల ఆదాయం

తెనాలిరూరల్: స్థానిక వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి హుండీ కానుకలు బుధవారం లెక్కించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు నేతృత్వంలో శ్రీ సీతారామ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.అమర్‌నాథ్ పర్యవేక్షణలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ హుండీలు లెక్కించారు. గత మే 3వ తేదీన హుండీ లెక్కింపు నిర్వహించగా సుమారు 58 రోజుల తర్వాత మళ్లీ బుధవారం లెక్కించినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు ద్వారా రూ.23,33,085 సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు.

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త జి.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పేరెంట్ కమిటీలను ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలుగా పేరు మార్పు చేసి ఎన్నికలు నిర్వహించేందుకు ఉత్తర్వులు విడుదల చేసిందని వెల్లడించారు.

గుంటూరు రేంజ్‌లో 24 మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
టి.విజయకృష్ణ	సీసీఎస్ ఒంగోలు	రాపూరు సర్కిల్, నెల్లూరు జిల్లా
పి.సుబ్బారావు	వీఆర్, గుంటూరు	వెంకటాచలంసత్రం సర్కిల్, నెల్లూరు జిల్లా
మారీదు శ్రీనివాసరావు	వీఆర్, గుంటూరు	చీరాల 1 టౌన్ పీఎస్, బాపట్ల జిల్లా
ఎం.విజయచరణ్	సోషల్ మీడియా/సైబర్ క్రైం సెల్, పల్నాడు	నరసరావుపేట -1 టౌన్ పీఎస్
యు.శోభన్‌బాబు	డీఎస్‌బీ- 2, పల్నాడు జిల్లా	వినుకొండ టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
పసుపులేటి రామకృష్ణ	వేమూరు సర్కిల్, బాపట్ల జిల్లా	నరసరావుపేట రూరల్ సర్కిల్, పల్నాడు
బి.సుబ్బనాయుడు	ఎస్సీ, ఎస్టీ సెల్, పల్నాడు	చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
కె.వెంకటప్రసాద్	డీఎస్‌బీ- 3, గుంటూరు	అచ్చంపేట యూపీఎస్, పల్నాడు జిల్లా
ప్రత్తిపాటి సురేష్	రేంజ్ వీఆర్, గుంటూరు	పెదకూరపాడు రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
పోలూరి శ్రీనివాస్	సత్తెనపల్లి టౌన్, పల్నాడు జిల్లా	సత్తెనపల్లి రూరల్ పీఎస్, పల్నాడు జిల్లా
మార్పనేని సుబ్బారావు	చీమకుర్తి పీఎస్ అటాచ్‌మెంట్	చీమకుర్తి పీఎస్, ప్రకాశం జిల్లా
సీహెచ్ హజరత్తయ్య	దిశ, బాపట్ల	సింగరాయకొండ సర్కిల్, ప్రకాశం జిల్లా
వై.నాగరాజు	రేంజ్ వీఆర్, గుంటూరు	ఒంగోలు 1 టౌన్ పీఎస్, ప్రకాశం జిల్లా
కె.అజయ్‌కుమార్	మహిళా పీఎస్ 2, నెల్లూరు జిల్లా	ఒంగోలు తాలుకా పీఎస్, ప్రకాశం జిల్లా
పి.వెంకటనారాయణ	నెల్లూరు వి(1) వేదాయపాలెం పీఎస్	కలిగిరి సర్కిల్, నెల్లూరు జిల్లా
ఎ.మల్లికార్జునరావు	రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల జిల్లా	రేపల్లె టౌన్ పీఎస్, బాపట్ల జిల్లా
పి.కిరణ్	రేంజ్ వీఆర్, గుంటూరు	పట్టాభిపురం పీఎస్, గుంటూరు జిల్లా
ఎం.శేషగిరిరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	మార్టూరు యూపీఎస్, బాపట్ల జిల్లా
కాకుమాను వెంకటరావు	సీసీఎస్, గుంటూరు	సంతమంగులూరు సర్కిల్, బాపట్ల జిల్లా
కొంకా శ్రీనివాస్	అరండల్‌పేట పీఎస్ అటాచ్‌మెంట్	అరండల్‌పేట పీఎస్, గుంటూరు జిల్లా

మంగళగిరి టౌన్ పీఎస్‌కు డి.వినోద్‌కుమార్, మంగళగిరి రూరల్ సర్కిల్‌కు యార్లగడ్డ శ్రీనివాసరావు, నల్లపాడు పీఎస్‌కు కె.వంశీధర్, చిట్టెం కోటేశ్వరరావును నెల్లూరు 1 టౌన్ పీఎస్‌కు బదిలీ చేశారు.

వీఆర్‌కు 15 మంది..

సీఐలు పి.శేషగిరిరావు, సి.కృష్ణారెడ్డి, సిరిగిరి సాంబశివరావు, కె.మల్లికార్జున, పి.శ్రీనివాసరెడ్డి, కరిముల్లాషావలి, జి.మంగరావు, ఎం.రాజేష్‌కుమార్, డి.రంగనాథ్, ఎం.డీఫిరోజ్, ఎం.నజీర్‌బేగ్, ఎస్.విజయచంద్ర, ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి, కె.నరసింహారావు, బి.అశోక్‌కుమార్‌లను వీఆర్‌కు పంపించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ డైరెక్ట్ 10th 1సం. ఇంటర్ (MPC BPC CEC MEC HEC) తెలుగు & ఇంగ్లీష్ మీడియం (APOSS/ NIOS) 2024 రిజల్ట్‌లో 100% పాస్ Cont : MSM Jr. College, Guntur. 93907 51544, 73867 06839

■ DMLT, హెల్త్ అసిస్టెంట్/శానిటరీ ఇన్‌స్పెక్టర్, అనస్థీషియా టెక్నీషియన్ కోర్సులు కలవు. Qul: ఇంటర్ పాస్ ఫ్రీ సీట్స్ కొరకు MSM Paramedical College, Guntur. 93907 51544, 73867 06839

REAL ESTATE

■ గుంటూరు GMCకి 4KM పరిధిలో Open Plots కలవు. 100చ॥గజాలు కేవలం 5లక్షలు మాత్రమే.సంప్ర:99662 31242, 9676723124, 8074790998

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) 88024 89999

WANTED

■ Need fluent English speaking and learning employees and receptionist are wanted best salary. Contact : 89784 19769

■ 10th- ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్నవారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్, Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ట్రస్ట్ ఆఫీస్‌వర్క్స్ 9963255441

■ గుంటూరు జిరాక్స్ షాపు నందు పనిచేయుటకు తెలుగు & ఇంగ్లీష్ టైపింగ్ చేయగలవారు కావలెను. మరియు జిరాక్స్ తీయుటకు అనుభవం గలవారు కావలెను. 94414 39523

■ ప్రముఖ హౌస్ కీపింగ్ కంపెనీ నందు పనిచేయుటకు ఉత్సాహవంతమైన యువకులు (Male వర్కర్స్) అర్జంటుగా కావలెను. వ.30 సం॥లోపు.మంచిజీతం. సంప్ర: 7901226699

■ శ్రీమంతుల ఇళ్లలో పెద్దవారిని, పిల్లలను, పేషంట్లను 24/7 చూసుకొనుటకు వర్కర్స్ & ANM, GNM కావలెను. జీ: 15k-18k, భోజనము, రూము ఉచితం. 9154802910, 9154802911, 14

■ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ప్రారంభించు బ్రాంచీల కొరకు బ్రాంచి మేనేజర్లు, క్లర్కులు, ఆఫీస్ స్టాఫ్ కావలెను. అమరావతి మ్యారేజ్ బ్యూరో, కావలి. సెల్:87902 75481, 94941 46145(వాట్సాప్).

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం గుంటూరు 7075167541 7075167663

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడిగా వాకా రామగోపాల్

తాడేపల్లిరూరల్: ఏపీ రాష్ట్ర గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా వాకా రామగోపాల్ గౌడ్ నియమితులయ్యారు. బుధవారం తాడేపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘం మాజీ అధ్యక్షులు చలమోలు అశోక్ గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరయ్యారు. అనగాని మాట్లాడుతూ గౌడ సంఘీయులు ఐకమత్యంగా ఉంటూ గౌడ సంక్షేమానికి పాటుపడాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వాకా రామగోపాల్‌ను అశోక్ గౌడ్ సత్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు తాతా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వేముల వెంకటాచలం పాల్గొన్నారు.



రామగోపాల్‌ను అభినందిస్తున్న మంత్రి అనగాని

పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జేసీ భార్గవ్ తేజ

చేబ్రోలు: పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చేబ్రోలు-1 గ్రామ సచివాలయాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హైస్కూల్స్‌లో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా ఆరా తీశారు. భోజనం ఏ విధంగా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్, యూనిఫాం, విద్యాబోధన ఏ విధంగా ఉందో తెలుసుకున్నారు. చేబ్రోలు-1 గ్రామ సచివాలయం తనిఖీలో సిబ్బంది పనితీరును సచివాలయంలో అందుతున్న సేవలు గురించి తెలుసుకున్నారు. తహసీల్దారు కార్యాలయంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రత్యేక అధికారి లక్ష్మీకుమారి, ఎంపీడీఓ కె.జ్యోతి, ఎంఈఓ ప్రసాద్ ఉన్నారు.



నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ముచ్చటిస్తున్న జేసీ భార్గవ్ తేజ

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

కొరిటెపాడు(గుంటూరు): ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై రైతాంగం ప్రత్యేక దృష్టి సారించాలని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గుంటూరులోని కృషి భవన్‌లో ప్రకృతి వ్యవసాయంపై గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల రైతు శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంతో ఆరోగ్యకర పంటలు చేతికందుతాయని, రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగం వలన పంటలు విషతుల్యమవుతున్నాయని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. శిక్షణ పొందుతున్న రైతు శాస్త్రవేత్తలు మిగిలిన రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా చూడాలన్నారు. రైతు సాధికారత సంస్థ అకాడమి ప్రతినిధి సుధాకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన భూసార సామర్థ్యం పెరుగుతోందని వివరించారు. భూమికి, వాతావరణానికి, మానవాళికి ఎంతో మంచి జరుగుతుందని చెప్పారు. ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందన్నారు. రసాయన ఎరువులు లేని పంటల కొనుగోలుపై అన్ని వర్గాల ప్రజలు దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. రైతాంగం కూడా ప్రకృతి వ్యవసాయ సాగును పెద్ద ఎత్తున చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ సాగులో రైతులకు కావాల్సిన అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.



మాట్లాడుతున్న డీఏఓ నున్న వెంకటేశ్వర్లు

తక్కెళ్లపాడు వద్ద దారి దోపిడీ

- ఏటీఎం కార్డు పేరుతో అడ్డగింత
- రూ.4 లక్షలతో దుండగుడు పరార్
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పెదకాకాని: పత్తి వ్యాపారిని అడ్డగించి రూ.4 లక్షలు దోచుకెళ్లిన ఘటన బుధవారం మండలంలోని తక్కెళ్లపాడు వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. కృష్ణా జిల్లా జి.కొండూరుకు చెందిన పెద్ది సుబ్బారావు పత్తి కొనుగోలు వ్యాపారి. పెదకాకాని మండలంలోని నంబూరు అడ్డరోడ్డు సమీపంలోని అమలోద్భవి హోటల్ యజమాని రవి గతంలో సుబ్బారావు వద్ద తీసుకున్న అప్పు రూ.4 లక్షలు బుధవారం ఇచ్చాడు. నగదు తీసుకుని పెదకాకానిలో నివసిస్తున్న కుమార్తె హేమలత ఇంటికి వెళ్లాడు. అనంతరం ప్రత్తిపాడు మండలం, కోయవారిపాలేనికి చెందిన సాంబశివరావుకు చెల్లించేందుకు రూ.4 లక్షలతో బయలుదేరాడు. తక్కెళ్లపాడు శివారులో జాతీయ రహదారిపై వెళుతుండగా వెనుక నుంచి ముఖానికి ముసుకు(మంకీ క్యాప్) ధరించిన వ్యక్తి బైక్‌పై వచ్చి సుబ్బారావు బైక్‌ను అడ్డుపెట్టి ఆపాడు. నా ఏటీఎం కార్డు ఎందుకు తీసుకున్నావ్ అంటూ వాదనకు దిగాడు. నాకు తెలియదు, నేను తీసుకోలేదని చెబుతున్నా వివాదానికి దిగి జేబులో, బైక్ పర్సులో చెక్ చేశాడు. ఆ సమయంలో సుబ్బారావు వద్ద ఉన్న డబ్బులు లాక్కుని బైక్‌పై వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు పెదకాకాని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

ఏఎన్‌ఎంలపై అనుచిత వ్యాఖ్యలకు ఖండన

'హంస' జిల్లా అధ్యక్షుడు నాగవర్ధన్



గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసి ప్రజల ఆరోగ్యం కాపాడడానికి బాధ్యతాయుతంగా కార్యక్రమాలను అమలు చేస్తున్న ఏఎన్‌ఎంలను ఆరోగ్య శాఖకు సంబంధం లేని కొంత మంది అధికారులు కించపరిచేలా మాట్లాడడాన్ని ఏపీ హంస జిల్లా కార్యవర్గం ఖండిస్తున్నట్లు హంస జిల్లా అధ్యక్షుడు బి.నాగవర్ధన్ తెలిపారు. ప్రతి సోమవారం బీసీజీ వ్యాక్సిన్, మంగళవారం ఏఎంసీ సేవలు, బుధవారం పిల్లల వ్యాక్సినేషన్, గురువారం బీసీజీ వ్యాక్సినేషన్, శుక్రవారం ఫ్రైడే డ్రైడే, శనివారం పిల్లల వ్యాక్సినేషన్ కార్యక్రమాలను ఏఎన్‌ంలు చేస్తున్నారన్నారు. వీటితోపాటు, మలేరియా, డెంగీ, ఇతర జ్వరాల నియంత్రణ కార్యక్రమాలు, లెప్రసీ, డయేరియా వ్యాధుల నియంత్రణ కార్యక్రమాలు, మాతా శిశు సంరక్షణ ఆన్‌లైన్ సేవలతో నిత్యం బిజీగా ఉండే ఏఎన్‌ఎంలను వేరే శాఖకు చెందిన అధికారులు వారిని తమ శాఖలో ఉపయోగించుకుంటూ కించపరిచేలా మాట్లాడటం దారుణమన్నారు. ఇతర శాఖల కార్యక్రమాల నుంచి ఏఎన్‌ఎంలకు మినహాయింపు ఇవ్వాలని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీవన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.కిరణ్, జిల్లా కోశాధికారి వెంకటప్ప ప్రభుత్వాన్ని కోరారు.

'నిరుల'లో బీటెక్ తరగతులు ప్రారంభం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యాలతో కూడిన విద్యనందించి ఉజ్వల భవిష్యత్‌ను కల్పించేందుకు తమ కళాశాల కృషి చేస్తోందని విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సర తరగతులు బుధవారం ప్రారంభించారు. విద్యార్థిని యశస్వి శుభగాత్రి స్వాగత నృత్యం, దీప ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ నిరుల కళాశాల బాలికలను శక్తివంతమైన, మేధోవంతులైన యువ ఇంజినీర్లుగా తీర్చి దిద్దుతూ, వారి శారీరక, మానసిక వికాసానికి అనువైన వాతావరణంలో నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక మాట్లాడుతూ తమ కళాశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది విద్యార్థినులకు బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందని చెప్పారు.



మాట్లాడుతున్న విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య

వైష్ణవ సంఘ సమాఖ్య కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న అళ్వార్ స్వామి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం జీయర్ స్వామి ఆశ్రమంలో ఉభయ రాష్ట్రాల శ్రీవైష్ణవ సంఘాలతో ఏర్పడిన శ్రీ భగవద్రామానుజ శ్రీ వైష్ణవ సంఘ సమాఖ్య కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మరింగంటి తిరుమొళిశై అళ్వార్ స్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవైష్ణవ సంప్రదాయ దేవాలయాలు, పీఠాలు, సంఘాల మధ్య సమన్వయం సాధించాలని, తద్వారా సంప్రదాయ రక్షణకు కృషి జరగాలని అన్నారు. కార్యక్రమంలో ఉభయ వేదాంత పీఠం వేద విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ముడుంబై మధుసూదనాచార్యులు, జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి, చక్రవర్తుల శ్రీనివాస రామానుజాచార్యులు, జగన్మోహనాచార్యులు, అగ్రహారం రాఘవేంద్ర, అకలంకం పార్థసారధి, వేదాంతం అచ్యుత కృష్ణ, యతిరాజుల బాలబాలాజీ, ఇతర సమాఖ్య సభ్యులు, అంగలకుదురు వాసుదాసాశ్రమ నిర్వాహకులు పట్టాభి పాల్గొన్నారు.